మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో రిగ్గింగ్ కు భారీ కుట్ర

- బయటి ప్రాంతాల నుంచి భారీగా రౌడీలు, గూండాలు దిగారు
- ఎస్ఈసీ తక్షణం అడ్డుకుని, ఎన్నికలు సజావుగా నిర్వహించాలి
- వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ డిమాండ్

తాడేపల్లి: నవంబర్ 1న పులివెందులలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో అల్లర్లు సృష్టించి, ఓట్లను రిగ్గింగ్ చేసుకుని, గెలిచామని చూపించుకునేందుకు వెన్నుపోటు పార్టీ, ప్రభుత్వం కలిసి కుట్ర చేస్తున్నాయని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే భారీ ఎత్తున బయటి ప్రాంతాల నుంచి గూండాలు, రౌడీలు టీడీపీ నేతల ఇళ్లలో, హోటళ్లలో పాగా వేసినట్లు వెల్లడించారు. ఎస్ఈసీ ఇప్పటికైనా అప్రమత్తమై పులివెందుల నుంచి బయటి వ్యక్తుల్ని వెనక్కి పంపడంతో పాటు పోలింగ్ కేంద్రాల లోపల, బయట పక్కాగా సీసీటీవీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసి అక్రమాల్ని అడ్డుకోవాలని పుత్తా శివశంకర్ డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్లో



పుత్తా శివశంకర్ ఇంకేమన్నారంటే..

పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ చేసే కుట్ర

రేపు ఒకటో తేదీన మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ఎల్లో మీడియా అంతా ప్రభుత్వంతో కలిసి భారీ కుట్రకు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా పులివెందుల చుట్టుపక్కల ఉన్న జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, రాయచోటి, అనంతపురం, తాడిపత్రి నుంచి వందల మంది గూండాలు పట్టణంలోకి వచ్చి వెన్నుపోటు పార్టీ నాయకుల ఇళ్లలో, హోటళ్లలో పాగా వేశారు. రేపు కూడా మరింత మందిని తీసుకొచ్చి ఒకటో తేదీ పోలింగ్ రోజున తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల చుట్టు పక్కల మోహరించి అల్లర్లకు పాల్పడేందుకు పక్కా ప్రణాళిక తయారు చేసుకున్నారు. అందులో భాగంగా అతి తక్కువ మంది పోలీసుల్ని పులివెందులలో భద్రత కోసం మోహరిస్తున్నారు. పోలీసులు తక్కువ మంది ఉంటే, ఎక్కువ మంది వచ్చారు కాబట్టి మేం కంట్రోల్ చేయలేకపోయామని చెప్పుకునేందుకే ఇలా చేస్తున్నారు. టీడీపీ వాళ్లే కుట్రలు చేసి వైఎస్సార్సీపీ క్రియాశీలక నాయకుల్ని, పోలింగ్ ఏజెంట్లను, కార్యకర్తల్ని అదుపులోకి తీసుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీన్ని ఎల్లో మీడియా అంతా వైఎస్సార్సీపీ నాయకులే దాడి చేశారంటూ ఓ పథకం ప్రకారం ప్రచారం చేసేందుకు సిద్ధమవుతోంది. మొన్న నామినేషన్ల సందర్భంగా కూడా వాళ్లు ఇదే చేశారు. ఈ కుట్రలో భాగంగా మా వాళ్లందరినీ అదుపులోకి తీసుకుని, బయటి నుంచి వచ్చిన గూండాలు, రౌడీలు దొంగ ఓట్లు వేయడం, రిగ్గింగ్ చేసేందుకు ఎల్లో మూకా భారీ కుట్రను సిద్ధం చేసింది.

ఎస్ఈసీ తక్షణం చర్యలు తీసుకోవాల్సిందే

కాబట్టి ఇంత సున్నితమైన ప్రాంతంలో పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీటీవీ కెమెరాలతో పాటు వెబ్ క్యాస్టింగ్ ను కూడా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను కోరుతున్నాం. ఎస్ఈసీగా మీకు ఉన్న అధికారం వాడి, బయటి నుంచి పులివెందులకు వచ్చిన వారిని తిరిగి వెనక్కి పంపాలని కోరుతున్నాం. ఎస్ఈసీ ఈ మేరకు చర్యలు తీసుకుంటుందా లేక ఈ కుట్రలో భాగం అవుతుందా అనేది ఇక్కడే తేలిపోతుంది. అదే సమయంలో బయటి ప్రాంతాల నుంచి పులివెందులకు వచ్చి పాగా వేసిన ఈ గూండాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజల్ని, ఓటర్లను కోరుతున్నాం. ఇలాంటి కుట్రల్ని ముందుగానే మేం ఎన్నికల కమిషన్ దృష్టికి ముందుగానే తెస్తున్నాం. కాబట్టి ఎస్ఈసీ కూడా సీసీటీవీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ తో పాటు అన్ని ముందస్తు చర్యలు తీసుకుని అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్సీపీ తరపున డిమాండ్ చేస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ ను సౌత్ బీహార్ అంటున్నారు

గతంలో పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలోనూ ఇదే తరహాలో కుట్రలు చేశారు. గొడవలు, అల్లర్లు చేసి జమ్ములమడుగు, కమలాపురం, రాయచోటి, అనంతపురం నుంచి గూండాల్ని తెచ్చి, గ్రామాల్లో ఓటర్లు బయటికి రాకుండా పహారా కాసి రిగ్గింగ్ చేసుకున్నారు. ఇప్పుడు కూడా అలాంటి కుట్రల్నే పునరావృతం చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇలాంటి కుట్రలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి చంద్రబాబు ఏం సాధిస్తారో అర్థం కావడం లేదు. ఈ కుట్ర ప్రజలందరికీ తెలిసిపోయింది. దేశమంతా, ప్రపంచమంతా ఈ వ్యవహారం తెలిసిపోయింది. అందుకే ఆంధ్రప్రదేశ్ ను సౌత్ బీహార్ అంటున్నారు. చంద్రబాబు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మాన ప్రాణాల్ని బలి తీసుకుంటున్నారు.